ఉత్సవాలకు శైవక్షేత్రాలు ముస్తాబు

పోలవరం రూరల్ : జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతోంది పట్టిసీమ. పోలవరం మండలంలోని అఖండ గోదావరి నది మధ్యలో స్వయంభూగా స్వామి వెలిశారని పురాణాలు చెబుతున్నాయి. మహాశివరాత్రి ఉత్సవాలకు ఏటా లక్ష మందికి పైగా భక్తులు వస్తూ ఉంటారు. గోదావరి నదిలో స్నానమాచరించి శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామిని దర్శించుకుంటారు. క్షేత్రం భక్తులకు దైవదర్శనంతో పాటు ఆహ్లాదాన్ని అందిస్తోంది. స్వయంభూ క్షేత్రంగా హరిహరుల ఆధిక్యతను చాటి చెప్పే పవిత్ర లింగోద్భవ సమయాన భక్తులు ఉపవాసంతో శివరాత్రి జాగరణ చేస్తారు. పుణ్యక్షేత్రాలు కాశీ, కేదారం, శ్రీశైలం, శ్రీకాళహస్తి, పట్టిసాచల క్షేత్రాలు పంచ మహాక్షేత్రాలుగా ప్రసిద్ధి చెందాయి. పట్టిసాచలాన్ని దేవకూటాద్రి, నీలాద్రి వంటి పేర్లతో పిలుస్తారు. పరమ శివుడు వీరేశ్వర స్వామిగా భద్రకాళీ సమేతుడై స్వయంభూగా వెలిశాడు. భూనీలా సమేత భావన నారాయణ స్వామి క్షేత్రపాలకుడు కావడం ఈ శైవక్షేత్రంలో మరో విశిష్టత. శివకేశవుల ఆరాధన ఈ క్షేత్రం ప్రత్యేకత, కనకదుర్గ, మహిషాసుర మర్ధిని అమ్మవార్లు గ్రామ దేవతలు, వీరభద్రస్వామి పట్టిసం అనే ఆయుధంతో దక్షప్రజాపతి శిరస్సు ఖండించి దేవకూట పర్వతంపై ప్రళయతాండవం చేశాడని, శాంతించమని దేవతలు వేడుకోగా, శివలింగాకారంతో స్వయంభూగా ఇక్కడ వెలిశాడని స్కంధ పురాణం చెబుతోంది. అందువల్లనే ఈ లింగం చుట్టూ బాహువులు ఉంటాయి.

గజేంద్రమోక్షం ఇక్కడే

ఈ దేవకూట పర్వతానికి సమీపంలో గజేంద్రునికి మహావిష్ణువు మోక్షం ప్రసాదించిన ప్రదేశం ఉంది. ఇదే ప్రదేశంలో శ్రీమహావిష్ణువు కరి, మకరలకు మోక్షం ప్రసాదించారనే ప్రతీతి. జాంబవంతుని కోరిక మేరకు దేవకూట పర్వతంపై భావన నారాయణస్వామి క్షేత్రపాలకుడై వెలిశాడు.



టి.నరసాపురంలో వధూవరులుగా స్వామి, అమ్మవార్లను అలంకరించిన దృశ్యం, పట్టిసం శివక్షేత్రంలో వీరభద్రస్వామి →

ఏర్పాట్లు పూర్తి

మహాశివరాత్రి సందర్భంగా పట్టిసం శివక్షేత్రం ముస్తాబైంది. లక్షమందికి పైగా భక్తులు వస్తారనే అంచనాతో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. కాలినడకన భక్తులు నడిచి వెళ్లి దైవదర్శనం చేసుకుని తిరిగి వచ్చేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఇసుక తిన్నెలపై ఈ ఉత్సవాలు జరగనున్నాయి. విద్యుత్ అలంకరణతో పాటు, పచ్చని పందిళ్లతో క్షేత్రాన్ని శోభాయమానంగా సుందరీకరించారు. స్నానఘట్టాల ఏర్పాటుతో పాటు పితృదేవతలకు పిండ ప్రధానాలు చేసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం పలువురు దాతలు అన్నసమారాధన ఏర్పాట్లు చేపట్టారు. ప్రత్యేక వైద్యశిబిరాలతో పాటు ఎస్ఈబీ, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ తదితర శాఖల అధికార యంత్రాంగం క్షేత్రం పనులపై నిమగ్నమయ్యారు. గోదావరిని కాలినడన దాటేందుకు వీలుగా ఆరు పంట్లతో తాత్కాలిక రోడ్డు మార్గం ఏర్పాటు చేశారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

బుట్టాయగూడెం : స్థానిక కుమ్మరిగట్టు సమీపంలో ఉన్న ఉమాసమేత ఉమా మహేశ్వరస్వామివారి ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినటట్లు విజయగణపతి ఆలయ కమిటీ ప్రతినిధి సోంబాబు తెలిపారు. 18వ తేదీ తెల్లవారుజాము నుంచి స్వామివారి దివ్యదర్శనం, అభిషేక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. అలాగే సాయంత్రం 6 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిసస్తామనన్నారు. రాత్రి 11:30కు లింగోద్భవం కాలంలో అభిషేక కార్యక్రమాలు నిర్వహిసస్తామని చెప్పారు. 19వ తేదీన అఖండ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

మహాశివరాత్రి వేడుకలు ప్రారంభం

టి.నరసాపురం : మండలంలోని టి.నరసాపురం, మక్కినవారిగూడెం, రాజుపోతేపల్లి, మల్లుకుంట గ్రామాల్లోని శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. టి.నరసాపురం కాశీ విశ్వేశ్వర ఆలయంలోనూ, మక్కినవారిగూడెం భువనేశ్వరి సమేత చంద్రశేఖర స్వామి ఆలయాల్లో గురువారం గణపతిపూజ, గోపూజ, మండపారాధన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. స్వామి, అమ్మవార్లను పెండికొడుకు, పెండ్లికుమార్తెగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మక్కినవారిగూడెం శివాలయంలో రేపాక శ్రీనివాసరావు, లావణ్య దంపతులు, టి.నరసాపురం కాశీ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో సందేపూడి పినాకపాణి దంపతులు ఆయా ప్రత్యేక పూజల్లో ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : శివరాత్రి పర్వదినోత్సవానికి ముక్కంటి ఆలయాలు ముస్తాబయ్యాయి. కన్నాపురం శ్రీ దుర్గా భవాని రసలింగేశ్వర స్వామి, అంకాలగూడెం శ్రీ ఉమా సమేత భోగ లింగేశ్వర స్వామి, పులివాగు శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, యర్రంపేట ఉమా రామలింగేశ్వర స్వామి, కొయ్యలగూడెం మీనాక్షి సమేత సుందరేశ్వర స్వామి ఆలయాలు శివరాత్రిని పురస్కరించుకొని భక్తుల చేత పూజలందుకోనున్నాయి. ఈ మహాశివరాత్రికి శని త్రయోదశి కూడా రావడం విశేషమని కాణ్వ విద్యాపీఠాధిపతి బ్రహ్మశ్రీ వెంకట అనిపెద్ది వేంకట నరసింహ శర్మ పేర్కొన్నారు. పట్టిసీమ పుణ్యక్షేత్రానికి శుక్రవారం సాయంత్రం నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు అధికారులు ప్రకటించారు.


పట్టిసం శివక్షేత్రం


శివక్షేత్రం వద్ద క్యూలైన్ల ఏర్పాటు


కన్నాపురం శివాలయం

అక్రమ లేఅవుట్‌లపై ఉక్కుపాదం

చింతలపూడి : అక్రమ లేఅవుట్‌లపై ఉక్కుపాదం మోపుతున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు తెలిపారు. గురువారం చింతలపూడి పట్టణపరిధిలో అక్రమంగా వేసిన లేఅవుట్‌లను సిబ్బందితో కలిసి ధ్వంసం చేయించారు. అదేవిధంగా అక్రమ లేఅవుట్‌లు వేసిన వారికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్‌లు వేయడం మునిసిపల్ చట్టం ప్రకారం నేరమని, ఇటువంటి నేరానికి భారీ జరిమానాలు, జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. లేఅవుట్‌లు నిర్మించాలనుకునే వారు ముందుగా నగర పంచాయతీలో అందుకు సంబంధించిన డీటీసీపీ అనుమతులు తీసుకోవాలన్నారు. అలాగే ప్రజలు కూడా అనుమతులు పొందిన లేఅవుట్‌లను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్‌లకు మాత్రమే నగర పంచాయతీ తరుపున మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. కావున ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టణంలో అక్రమ లేఅవుట్‌లను గుర్తించి ట్రాక్టర్‌తో ధ్వంసం చేయించి, రాళ్లను తొలగించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


చింతలపూడిలో అక్రమ లేఅవుట్‌లను దున్నేస్తున్న దృశ్యం

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని ఆందోళన

టి.నరసాపురం : అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుచేయాలని గండిగూడెంకు చెందిన ఎస్సీ సామాజికవర్గ పెద్దలు డోల ప్రకాశరావు, కాకాని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆ మేరకు టి.నరసాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు మాట్లాడుతూ తమ కుల సంఘానికి దాతలు బహూకరించిన భూమికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 1960లో సాయిల సుబ్బయ్య గ్రామంలో సర్వే నెంబర్ 263/1లో తనకున్న 37 సెంట్ల భూమిలో 5 సెంట్ల భూమిని కుల సంఘానికి దానంగా రాసి ఇచ్చారని వివరించారు. అదే గ్రామానికి చెందిన ఎస్.మంగరాజు అనే వ్యక్తి డోలా సీతమ్మ అనే మహిళ వద్ద నుంచి 5 సెంట్ల భూమిలో 2 సెంట్ల భూమిని కొనుగోలు చేసినట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడమే కాకుండా భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తుండగా, తాము అడ్డుకున్నామని, దాంతో తమపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డోలా సీతమ్మ భర్త చంద్రయ్య బతికి ఉండగానే చనిపోయినట్లు నకిలీ పత్రాలు సృష్టించి ఆ భూమి చంద్రయ్యకు చెందిందని అప్పటి తహసీల్దార్ వద్ద నకిలీ ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నారని ఆరోపించారు. ధ్రువీకరణ పత్రం పొందిన రెండేళ్ల తరువాత చంద్రయ్య చనిపోయారని వివరించారు. ఈ భూమి విషయంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాడ్ చేశారు. స్థలం వద్ద ఇరువర్గాలు వాగ్వివాదానికి దిగడంతో ఎస్సై కె.సతీష్‌కుమార్ తన సిబ్బందిని పంపి, స్థల వివాదం తహసీల్దార్ కోర్టులో ఉన్నందున, విచారణ పూర్తయ్యేవరకు ఎవరూ ఆ భూమిలోకి వెళ్లవద్దని, ఇరువర్గాలను శాంతింపచేశారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్సీ సామాజికవర్గ పెద్దల ఆందోళన

దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా

శ్రీవారి దేవస్థానం నూతన ట్రస్టుబోర్డు సభ్యురాలు పద్మ

ద్వారకాతిరుమల : శ్రీవారి దర్శనార్థం ఆలయానికి వెళ్లే స్థానికులకు తగిన ప్రాధాన్యత లభించేలా కృషి చేస్తామని దేవస్థానం నూతన ట్రస్టుబోర్డు సభ్యురాలు పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ తెలిపారు. ఇటీవల ఆమె ట్రస్టుబోర్డు సభ్యురాలిగా ప్రమాణస్వీకారం చేశారు. దీన్ని పురస్కరించుకుని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం వద్ద గురువారం అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటకొండ పద్మ, జ్యోతిశ్రీనివాస్ దంపతులను సర్పంచ్ కుంటం స్వర్ణలత, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉక్కుర్తి వెంకట్రావు, నాయకులు అంబటి గాంధి, యిమ్మడి నాగు, చేబోలు రాజేష్, కుంటం సతీష్, స్థానికులు గువ్వల మావుళ్లు, ఒబిలిశెట్టి గంగరాజుకుమార్(శేఖర్), తదితరులు ఘనంగా సత్కరించారు. దుశ్శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, అభినందనలు తెలిపారు. అలాగే పలువురు మొమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వర్ణలత మాట్లాడుతూ గ్రామానికి చెందిన మహిళకు దేవస్థానం ట్రస్టుబోర్డులో సభ్యురాలిగా స్థానం లభించడం హర్షణీయమన్నారు. అనంతరం ట్రస్టుబోర్డు సభ్యురాలు వెంకటకొండ పద్మ మాట్లాడుతూ గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావుల ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. దేవస్థానం నుంచి గ్రామ పంచాయతీకి రావాల్సిన నిధులను, అభివృద్ధి పనులను జరిగేలా చూస్తామన్నారు. అన్నింటా మహిళలకు ప్రాధాన్యతనిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో తనకు ఈ పదవీ రావడం ఆనందంగా ఉందన్నారు. దేవాలయ అభివృద్ధితో పాటు గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తానని ఆమె హామీ ఇచ్చారు.


పద్మ, జ్యోతిశ్రీనివాస్ దంపతులకు మెమెంటోను అందజేస్తున్న సర్పంచ్ స్వర్ణలత, తదితరులు

తహసీల్దార్‌కు వినతి

కామవరపుకోట : ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ డీవీ సత్యనారాయణకు కామవరపుకోట ఏపీటీఎఫ్ మండల శాఖ వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా సీపీఎస్ రద్దు చేయాలని, 11 పీఆర్‌సీ అసంఘాతాలు తొలగించాలని, 12వ వేతన సంఘం నియమించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు నాయకులు తెలిపారు.

ఎంపీ శ్రీధర్‌ను కలిసిన నిర్వాసితులు

కుక్కునూరు : పోలవరం ప్రాజెక్ట్ 41.15 కాంటూర్ పరిధిలో ముంపునకు గురవుతున్న కుక్కునూరు ఏ బ్లాక్, కివ్వాక గ్రామాల ఇంటి విలువలకు సంబంధించి ప్రచురించిన పేపర్ నోటిఫికేషన్‌లో పలువురి నిర్వాసితుల పేర్లు రాలేదన్న విషయమై రెండు గ్రామాలకు చెందిన నిర్వాసితులు గురువారం ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ, ఇంటివిలువలకు సంబంధించి గతంలో పంచాయతీలలో ఉంచిన జాబితాలో తమ పేర్లు మిస్సైయిన విషయమై ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్యను కలిసి విన్నవించగా ఆయన గ్రామసభల నాటికి విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, కాని ఇంతవరకు జాబితాలో పేర్లు చేర్చలేదన్నారు. తమకు న్యాయం చేయాలని ఎంపీని కలిసి విన్నవించినట్టు చెప్పారు.


ఎంపీ కోటగిరి శ్రీధర్‌తో కుక్కునూరు, కివ్వాక నిర్వాసితులు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలి

జంగారెడ్డిగూడెం : విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటిని సాధించాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో శ్రీరామచంద్ర విద్యాసంస్థల 19వ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ లక్ష్య సాధనకు విద్యార్థి దశ కన్నా మంచి సమయం ఏదీ లేదన్నారు. కార్యక్రమంలో కోస్టల్ ఏరియా బ్యాంక్ ఎండీ, సీఈవో వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, మాజీ డీసీసీబీ ఛైర్మన్ కరాటం రాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవల్లి విజయసారధి, రామచంద్ర విద్యాసంస్థల అకడమిక్ ఛైర్మన్ బీవీ సత్యనారాయణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వీవీఎస్ జగదీష్‌కుమార్, విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపించుకుందాం


నూకల రాముని సత్కరిస్తున్న వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది

కొయ్యలగూడెం : రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించుకుందామని కొయ్యలగూడెం జగనన్న సచివాలయాల మండల కోఆర్డినేటర్ (మండల సచివాలయాల కన్వీనర్) నూకల రాము పిలుపునిచ్చారు. గురువారం కొయ్యలగూడెం సచివాలయం వద్ద సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు కలిసి నూకల రాముకి సన్మానం చేశారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సమన్వయంతో పనిచేసి జగనన్న గెలుపునకు కృషి చేయాలని కోరారు.

సబ్‌జైలును సందర్శించిన జడ్జి

చింతలపూడి : స్థానిక సబ్‌జైల్‌ను గురువారం జడ్జి ఎస్‌కే ఇబ్రహీం షరీఫ్ సందర్శించారు. ఈ సందర్భంగా జైలు అధికారుల నుంచి కేసులకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే జైలులో శిక్ష అనుభవిస్తున్న వారికి అందుతున్న వసతి, వైద్య సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శిక్ష అనుభవిస్తున్న వారు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలన్నారు. చెడుకు దూరంగా ఉండాలని, కష్టపడి పనిచేసే తత్వం అలవాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో న్యాయవాదులు మీసాల రమేష్, సందిపాము సర్వయ్య, రాచప్రోలు విక్రమ్, పట్నాల శ్రీనివాస్, సోషల్‌వర్కర్ ఎండీ అక్బర్ ఆలీ, జైలు సూపరింటెండెంట్ గోలి వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళను కొట్టి, బెదిరించిన వ్యక్తిపై కేసు

ద్వారకాతిరుమల : ఇల్లు ఖాళీ చేయాలని ఒక మహిళను కొట్టి, బెదిరించిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని గుణ్ణంపల్లికి చెందిన నక్కా లక్ష్మి నివసిస్తున్న ఇల్లు తనదంటూ, ఆమె భర్త మొదటి భార్య కుమారుడు నక్కా నరసింహరాజు ఈనెల 15న సాయంత్రం సదరు ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి, ఆమెను కొట్టాడు. ఇల్లు ఖాళీ చేయకపోతే చంపేస్తానని బెదిరించాడు. దీనిపై బాధితురాలు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బెదిరించిన ముగ్గురిపై కేసు నమోదు

ద్వారకాతిరుమల : ఇంటి స్థలం తమ పేరున రాయాలంటూ ఓ వ్యక్తిని బెదిరించిన ముగ్గురిపై గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సీహెచ్.పోతేపల్లి గ్రామానికి చెందిన తుందుర్తి సత్యవతి కుమారుడు ప్రభుత్వం ద్వారా పొందిన స్థలంలో ఇంటిని నిర్మించుకుని అందులో నివసిస్తున్నాడు. అయితే ఈనెల 15న సాయంత్రం 6 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన పెదవేగి శ్రీను, పెదవేగి రాజు, తుందుర్తి దుర్గయ్య అనే ముగ్గురు వ్యక్తులు అతడి ఇంటికి వెళ్లి, ఫెన్సింగ్‌ను తొలగించారు. ఆ భూమిని తమకు రాసివ్వాలని, దీనిపై ఇంజక్షన్ ఆర్డర్ కూడా పొందామని బెదిరించారు. దీనిపై సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మోటార్‌సైకిల్ చోరీపై గంగుల పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. స్థానిక గరుడపక్షినగర్‌కు చెందిన పవన్‌కుమార్ ఈ నెల 11వ తేదీ రాత్రి ఇంటి వద్ద మోటార్‌సైకిల్‌ను పార్క్ చేశాడు. మరోసటిరోజు ఉదయం లేచి చూసేసరికి మోటార్‌సైకిల్ కనిపించలేదు. అప్పటి నుంచి వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్లుప్తంగా

గౌడ సంఘం అభివృద్ధికి కృషిచేయాలి


మంత్రి జోగి రమేష్‌కు ఆయన చిత్రపటాన్ని అందజేస్తున్న మానవత మూర్తి

జంగారెడ్డిగూడెం : గౌడ సంఘం అభివృద్ధికి జిల్లా నాయకులుగా నిర్విరామంగా కృషి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. బుధవారం రాత్రి జంగారెడ్డిగూడెంలోని ఓ వివాహ వేడుకకు మంత్రి హాజరయ్యారు. తొలుత మున్సిపల్ కౌన్సిలర్ అయినాల వెంకటరమణ మూర్తి (మానవత మూర్తి) కార్యాలయంలో మంత్రి జోగి రమేష్ కొద్ది సేపు పార్టీ నాయకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఇటీవల జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన అయినాల వెంకట రమణ మూర్తికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి జోగి రమేష్‌కు ఆయన చిత్రపటాన్ని నాయకులు బహూకరించారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

బుట్టాయగూడెం : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు పనిచేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలో నందాపురం సమీపంలో గల పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాస కాలనీ వద్ద గురువారం నూతనంగా ఎంపిక చేసిన సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డిశ్చార్జ్ అయి విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే బాలరాజు ఫోన్‌లో మాట్లాడారు. తాను త్వరలోనే ప్రజలతో కలిసి పార్టీ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటానని చెప్పారు. పార్టీ సీనియర్ నాయకులు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అనారోగ్య సమస్యను ఆసరాగా చేసుకుని కొందరు పన్నుతున్న కుట్రలను పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని అన్నారు. పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి పాల్గొన్నారు.

గ్రామసభ బహిష్కరణ

వేలేరుపాడు : ఇంటి విలువలు (స్ట్రక్చర్ వాల్యూస్) తక్కువగా వచ్చాయంటూ రుద్రమ్మకోట గ్రామస్తులు గురువారం ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభను బహిష్కరించారు. 2019 డిసెంబర్ 24న తమ గ్రామానికి సంబంధించి ఇంటి విలువలు ప్రకటించి సంతకాలు కూడా సేకరించారని, మరలా ఈ గ్రామసభ ఏంటని అధికారులను నిలదీశారు. తమకు గతంలో ప్రకటించిన ఇంటి విలువలు ఇవ్వాలని కోరారు. రుద్రంకోట గ్రామసర్పంచ్ నాగంపల్లి స్వర్ణలత, గుద్దేటి భాస్కర్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, రహీమ్, మెండెం కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణ

ద్వారకాతిరుమల : క్షేత్రపాలకుని ఆలయంలో శివదేవుని కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని గురువారం విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం వేదపారాయణలు, స్వామివారికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చనలను అర్చకులు కన్నులపండువగా నిర్వహించారు. సాయంత్రం విఘ్నేశ్వరపూజ, శైవపుణ్యహవాచన, పంచగవ్యప్రాసన, దీక్షాదారణ, యాగశాల ప్రవేశన, ప్రతిష్ఠాపన, అంకురార్పణను అర్చకులు, పండితులు వైభవోపేతంగా జరిపారు. అనంతరం రాత్రి ధ్వజారోహణను వేద మంత్రోచ్ఛరణలతో అట్టహాసంగా నిర్వహించారు. కల్యాణమహోత్సవాలను పురస్కరించుకుని ఆలయం విద్యుద్దీప కాంతులతో శోభిల్లుతోంది.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీని అరికట్టాలి

చింతలపూడి : ఇటీవల ప్రగడవరం గ్రామ పంచాయతీ పరిధిలోని పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీ జరుగుతున్న నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం చింతలపూడి మండల అధ్యక్షుడు కనమతరెడ్డి చంద్రశేఖరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌ల జంపర్లు తప్పించి ట్రాన్స్‌ఫార్మర్‌లు పగులగొట్టి వాటి నుంచి కాపర్ వైరు, ఖరీదు గల ఆయిల్ చోరీ చేస్తున్నారన్నారు. ఇలా పంచాయతీ పరిధిలో వారంరోజుల్లోనే 8 ట్రాన్సుఫార్మర్‌లు ధ్వంసమయ్యాయన్నారు. దీంతో విద్యుత్ సరఫరా లేక మొక్కజొన్న, పామాయిల్ , మిరప పంటల రైతాంగం తీవ్రంగా నష్టపోతున్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ద్వారకాతిరుమల : ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక శ్రీశ్రీనివాస డిగ్రీ కళాశాలలో రిజర్వు బ్యాంక్ వారు అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలన్నారు. అనంతరం స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వ మాట్లాడుతూ విద్యార్థులు బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంచుకోవాలన్నారు. రుణయాప్‌లకు ఎవరూ బలికాకూడదని, ఏ రుణ సదుపాయమైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్యాంకింగ్ సంస్థల నుంచే పొందాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దావులూరి దుర్గాదేవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం

చింతలపూడి : మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం చింతలపూడిలోని కాంతంపాలెం రోడ్‌లో ఉన్న షాదీఖానా వద్ద శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా ముఖ్యఅతిథిగా హాజరై సచివాలయ కన్వీనర్‌లకు, గృహసారథులకు దిశా నిర్దేశం చేస్తారన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని గ్రామాలు

ద్వారకాతిరుమల: మండలంలోని ద్వారకాతిరుమల, తిమ్మాపురం, రాళ్లకుంట, సత్తెన్నగూడెం, దొరసానిపాడు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఆ శాఖ ఏఈ నరసింహస్వామి గురువారం ఒక ప్రకటలో తెలిపారు. ద్వారకాతిరుమలలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు, చెట్టుకొమ్మల తొలగింపు నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మునిసిపల్ పన్నులు రూ.4.80 లక్షలు వసూలు

జంగారెడ్డిగూడెం : మొండి బకాయిలు వసూలు కార్యక్రమం గురువారం నాలుగో రోజు కొనసాగినట్లు మునిసిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తెలిపారు. నగదు, చెక్కు రూపంలో రూ.4.80 లక్షలు వసూలయ్యాయన్నారు. ఇంటిపన్నులు, కుళాయి పన్నులు ఇప్పటి వరకు చెల్లించని వారు, మొండిబకాయిదారులు వెంటనే చెల్లించాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సుబ్బారావు, మేనేజర్ వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమెషీన్లు, సైకిళ్లు పంపిణీ


ఉచిత కుట్టుమెషీన్లు, సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : మహిళలు స్వయం ఉపాధిని ఏర్పరచుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని రోటరీ జంగారెడ్డిగూడెం అధ్యక్షుడు దాకారపు కృష్ణ అన్నారు. స్థానిక కాలేజ్ రోడ్ లోని శ్రీమద్ది ఆంజనేయ మార్క్స్ లిమిటెడ్ కార్యాలయ సమీపంలో రోటరీ, కోస్టల్ బ్యాంకు ఆధ్వర్యంలో మహిళా సాధికారత సేవా కార్యక్రమంలో భాగంగా 66 ఉచిత కుట్టుమెషీన్లు, 9 సైకిళ్లు పంపిణీ చేశారు. రోటరీ మహిళా సాధికారత కోసం చేస్తున్న కార్యక్రమాల్లో తాము భాగస్వాములైనందుకు సంతోషంగా ఉందని కోస్టల్ ఏరియా బ్యాంక్ ఎండీ, సీఈవో బి.వేణుగోపాల్ అన్నారు. రోటరీ కార్యదర్శి ఉడా రాంగోపాల్, కోస్టల్ బ్యాంక్ మేనేజర్ టి.అప్పారావు, కేఎల్ఎన్ ధనకుమార్, మల్లాది సీతా రామారావు, బండారు సత్యనారాయణ, పాలపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఆర్‌టీల సమస్యలను పరిష్కరించాలి

బుట్టాయగూడెం : కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్‌టీల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బి.పోసిబాబు కోరారు. గురువారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి సీఆర్‌టీ పోస్టులను రెన్యువల్ చేయాలని కోరుతూ తమ సంఘం ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ బి.మల్లికార్జున రెడ్డికి వినతిపత్రం అందించామని అన్నారు. ఉద్యోగ భద్రత, 22 రోజుల పాటు సెలవులు, ఏడాదిపాటు జీతం ఇచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఆర్‌టీయూ నాయకులు జి.రమేష్, టి.సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, పి.కోటిబాబు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

పసుపులేటి వరుణ్ అచ్యుత్ రామ్ S/O వెంకన్నబాబు, కొత్తపేట, బుట్టాయిగూడెం గ్రామం,మండలం అను నా యొక్క పాస్‌పోర్ట్ నెం. V.2803919 అనునది జిరాక్స్‌ల నిమిత్తం ఇంటి వద్ద నుండి జిరాక్స్ షాపునకు వెళ్ళు దారిలో పడిపోయినది. దొరికినవారు ఈ క్రిందినెంబర్‌కు తెలియజేయగలరు.

సెల్: 9398631793